
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 8 ఫిబ్రవరి 2025



కొత్త ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు ప్రారంభం కాబోతున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు చేపట్టబోయే పనులకు ప్రణాళికలు రూపొందించారు. అయితే గతంలో కంటే ఈసారి భిన్నంగా ఈజీఎస్ పనులకు డిమాండ్ రాబోతుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం ఉపాధి హామీ పథకం పనులకు అనుసంధానం చేయడంతో ఈసారి ఎక్కువ మంది పనుల్లో పాల్గొనే అవకాశం నెలకొంది. అయితే కొత్త జాబ్‌కార్డుల మంజూరు మాత్రం ఇంకా ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. పాత జాబ్ కార్డులతోనే ప్రస్తుతం పనులు సాగుతున్నాయి.



ఊపందుకోనున్న ఉపాధి పనులు

- ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో ఈజీఎస్ పనులపై ఆసక్తి
- ఖమ్మంలో 3.06 లక్షల జాబ్ కార్డులు
- భద్రాద్రి కొత్తగూడెంలో 2.19లక్షలు...
- ఇరు జిల్లాల్లో మొత్తం 1.18 కోట్ల పని దినాల లక్ష్యం

కొత్త జాబ్‌కార్డులపై ఇంకా వెలువడని నిర్ణయం

ఖమ్మం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో 3.06లక్షల మంది జాబ్‌కార్డులు తీసుకోగా, కేవలం లక్షా73 వేల మంది మాత్రమే ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. భద్రాద్రి జిల్లాలో 2.19లక్షల జాబ్‌కార్డులు ఉన్నప్పటికీ లక్షా35వేల మంది మాత్రమే పనుల్లో పాల్గొంటున్నారు. అయితే ఈసారి రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం ప్రవేశపెట్టి ప్రతీ సంవత్సరం రూ.12వేల చొప్పున మంజూరుకు పథకానికి శ్రీకారం చుట్టింది. ఏడాదిలో రెండుసార్లు రూ.6వేల చొప్పున రూ.12వేలు అందించనున్నారు. కనీసం ఏడాదిలో 20రోజుల్లో ఉపాధి పనుల్లో పాల్గొని ఉండాలని నిబంధనలు విధించడంతో కొద్దిమందికి మాత్రమే అర్హత లభించింది. ఈసారి ఉపాధి పనుల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరు ఏడాదిలో 20 రోజుల వరకు పనుల్లో పాల్గొనే పరిస్థితి కనిపిస్తుంది.

పెరిగిన అంచనాలు...

రాష్ట్ర ప్రభుత్వం కొత్త జాబ్ కార్డులకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. ప్రస్తుతం పాతకార్డులు ఉన్న వారికి ఉపాధి పనులు నడుస్తున్నాయి. ఖమ్మంజిల్లాలో సుమారు 68 లక్షల పని దినాలకు గాను 64 లక్షల పనిదినాలు కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.109 కోట్ల విలువైన పనులు చేపట్టారు. కాగా కొత్త ఆర్థిక ఏడాదిలో అదే 68 లక్షల పనిదినాలను లక్ష్యంగా ఉంచారు. కనీసం 2.28లక్షల మందికి ఉపాధి హామీ కింద పని దినాలు కలిపించేందుకు ప్రణాళిక రూపొందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 45.70లక్షల పనిదినాలు ఉపాధి పనులు నిర్వహించారు. సుమారు రూ.105 కోట్లు ఖర్చు చేశారు. వచ్చే ఏడాది సుమారు 50 లక్షల పనిదినాలు లక్ష్యంగా పెట్టుకుని సుమారు రూ.115కోట్ల విలువైన పనులు నిర్వహించాలని లక్ష్యం పెట్టుకోవడం జరిగింది. మొత్తంమీద, ఈసారి ఉపాధి హామీ పనులకు ఇందిరమ్మ ఆత్మీయభరోసాతో డిమాండ్ ఏర్పడింది. కొత్తజాబ్‌కార్డులు తీసుకునేందుకు గ్రామాల్లో కూలీలు ఉత్సాహం చూపుతున్నారు.



మార్కెట్ కమిటీలకు కాసుల వర్షం

- లక్ష్యాన్ని దాటేసిన వైరా, కల్లూరు, సత్తుపల్లి, మద్దులపల్లి మార్కెట్లు
- మార్చి నెలాఖరుకు మిగతా కమిటీల టార్గెట్లు పూర్తయ్యే అవకాశం
- ఇప్పటివరకు ఖజానాకు చేరిన 80 శాతం ఫీజు



ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయాలు టాప్ గేర్‌లో దూసుకుపోతున్నాయి. మార్కెట్ కమిటీలకు ఈ ఏడాది రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన మార్కెట్ ఆదాయం టార్గెట్‌ను నూటికి నూరు శాతం లక్ష్యాన్ని ఛేదించే దిశగా మార్కెట్ కమిటీలు పరిగెడుతున్నాయి.

జిల్లాలో ప్రధానంగా ఖమ్మం, మధిర, నేలకొండపల్లి, కల్లూరు, వైరా, ఏన్కూరు, సత్తుపల్లి, మద్దులపల్లి తదితర 8 మార్కెట్ కమిటీలకు 2024-2025 సంవత్సరానికి గాను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ రూ. 54.35 కోట్ల మార్కెట్ ఆదాయాన్ని సమకూర్చాలని టార్గెట్‌గా నిర్దేశించింది. అయితే జిల్లాలోని మార్కెట్ కమిటీలు సీజన్ ప్రారంభంలో కొంత తడబడినప్పటికీ ఇప్పటి వరకు సుమారు రూ. 44.70 కోట్ల ఆదాయాన్ని రాబట్టుకోవడం విశేషం. కాగా ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు అంటే మార్చి 31 నాటికి ఇంకా లక్ష్యంలో రావాల్సిన మొత్తం రూ. 10 కోట్ల లక్ష్యాన్ని సులువుగానే సమకూర్చుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మార్కెట్‌లకు ముఖ్యంగా యార్డులలో జరిగే క్రయవిక్రయాలపై కేవలం 1 శాతం ఫీజు (మిగతా 6వ పేజీలో)

ఇప్పటివరకు మార్కెట్ కమిటీలు సాధించిన ఆదాయ వివరాలు (జనవరి 31 వరకు)

మార్కెట్ కమిటీలు	లక్ష్యం	ఆదాయం
ఖమ్మం	30.00 కోట్లు	19.70కోట్లు
మధిర	4.30 కోట్లు	3.52 కోట్లు
నేలకొండపల్లి	2.75 కోట్లు	2.60 కోట్లు
కల్లూరు	3.20 కోట్లు	4.91 కోట్లు
వైరా	4.25 కోట్లు	5.33 కోట్లు
ఏన్కూరు	4.68 కోట్లు	2.93 కోట్లు
సత్తుపల్లి	3.50 కోట్లు	3.88 కోట్లు
మద్దులపల్లి	1.67 కోట్లు	1.79 కోట్లు

స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు

- పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు షెడ్యూల్ విడుదల
- కసరత్తు చేస్తున్న జడ్పీ, మండల పరిషత్ అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ఎన్నికలకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామపంచాయతీల కంటే ముందుగానే ఎన్నికలు నిర్వహించాలన్న సూచనప్రాయ అభిప్రాయంతో జడ్పీ, మండల పరిషత్ అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై షెడ్యూల్‌ను శుక్రవారం ఖరారు చేసింది. జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీల్లో ఓటర్ల జాబితాలు ఇప్పటికే రూపొందించారు. ఖమ్మం జిల్లాలో 20 మండల పరిషత్లలో 288 ఎంపీటీసీ స్థానాలు ఖరారు చేశారు. గ్రామ పంచాయతీల వారీగా రూపొందించిన ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 8,64,702 మంది ఓటర్లున్నారు. దీనికి అనుబంధ జాబితాలో మరో 4,167 మంది ఓటర్లు పెరగనున్నారు. గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా సిద్ధం చేసిన ఓటర్ల జాబితా ఆధారంగా ఎంపీటీసీ(మండల ప్రాదేశిక నియోజకవర్గం)ల్లో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు.

500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం

ఎంపీటీసీల్లో ప్రతి 500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం సూచించిన నేపథ్యంలో గతంలో 1615 పోలింగ్ కేంద్రాలున్నాయి. ప్రస్తుతం ఓటర్ల సంఖ్య ఆధారంగా ప్రతి పోలింగ్ కేంద్రానికి 500 మంది ఓటర్లు ఉండేలా చేస్తే మరిన్ని పోలింగ్ కేంద్రాలు పెరిగే ఆస్కారం ఉంది. ఈ నేపథ్యంలో 10వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను సిద్ధం చేసి 11న ప్రచురిస్తారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో జాబితాను ప్రదర్శనకు పెడతారు. 11 నుంచి 13వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. 14న అభ్యంతరాలను పరిష్కరించి కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ ఆమోదానికి పంపిస్తారు. 15న తుదిజాబితాను ప్రచురిస్తారు.



పోలింగ్ సామగ్రిని మండలాల వారీగా విభజిస్తున్న సిబ్బంది

మండలాల వారీగా ఎంపీటీసీ స్థానాలు ఇలా :

జిల్లాలో 20 మండలాల్లో 288 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలున్నాయి. బోనకల్లు-13, చింతకాని-14, ఏన్కూరు-10, కల్లూరు-18, కామేపల్లి-12, ఖమ్మం రూరల్-14, కొణిజర్ల-15, కూసుమంచి-17, మధిర-12, ముదిగొండ-17, నేలకొండపల్లి-18, పెనుబల్లి-15, రఘునాథపాలెం-13, సత్తుపల్లి-13, సింగరేణి-16, తల్లాడ-16, తిరుమలాయపాలెం-18. వేంసూరు-13, వైరా-10, ఎర్రుపాలెం మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలున్నాయి. జిల్లా పరిషత్ పరిధిలో 20 ప్రాదేశిక నియోజకవర్గాలున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

పువ్వాడ ఉదయ్ నగర్‌లో విషాద ఛాయలు

6



తేజావత్ విజయ్, భూక్యా వినోద్ (ఫైల్)

ఊరిస్తున్న మామిడి

- జిల్లాలో 32,105 ఎకరాల్లో సాగు
- పిందె దశలో పంట.. జాగ్రత్తలు తప్పనిసరి
- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎంవీ మధుసూదన్



మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి



ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో మామిడి తోటలను 32,105 ఎకరాలలో సాగుచేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో సత్తుపల్లి, వేంసూర్, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, ఎర్రుపాలెం తదితర మండలాల్లో ఎక్కువగా తోటలు ఉన్నాయి. ముఖ్యంగా సాగులో ఉన్న రకాలు బంగినపల్లి , దశేరి, హిమాయత్, తోతపూరి, రసాలు తదితర రకాలను సాగు చేస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితులు మరియు క్రితం పరిస్థితులు దృష్ట్యా రైతులలో, వినియోగదారులలో ఈ మామిడి పండ్ల వినియోగం బాగా పెరిగింది. ఎందుకనగా ఈ మామిడి పండ్లలో విలువైన పోషకాలతో పాటు ఖనిజ లవణాలు, విటమిన్లు, పీచు పదార్థం ఉంటుంది. తద్వారా అవి తిన్నవారిలో రోగ నిరోధక శక్తి పెరిగి కరోనాతో పాటు ఇతర వ్యాధులను తట్టుకునే శక్తి పెరుగుతుంది. ప్రస్తుతం మామిడి పూత నుండి పిందె దశలో ఉన్నది. ఈ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సినదిగా జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎంవీ మధుసూదన్ తెలిపారు.

పిందెలు రాలకుండా నీటి తడులు

మామిడిలో ఏర్పడిన పిందెలు రాలిపోవడం పెద్ద సమస్య తోటల్లో నీటి ఎద్దడి, చెట్లలో హార్మోనులు, పోషక లోపాల వల్ల ఇలా జరుగుతాయి. పిందెలు ఏర్పడే దశలో, తిరిగి 15-20 రోజుల వ్యవధిలో నీటి అవకాశమున్న చోట్ల చెట్లకు 2-3 నీటి తడులివ్వడం వలన మంచి ఫలితాలు వస్తాయి. దీనివల్ల పిందెలు రాలడం తగ్గడమే కాకుండా కాయలు పెద్ద సైజులో నాణ్యంగా ఉంటాయి. కాయలకు మంచి ధర వస్తుంది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
Union Bank of India
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
చిరునామా: బిఎస్‌సి బ్రాంచి, స్వజన ఆర్థోహాస్పటల్ ఎదురుగా, ఖమ్మం
సెల్: 9652405150. ubin0807508@unionbankofindia.bank

స్థిరాస్తుల అమ్మకం కొరకు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) రూల్ 9(1) చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) రూల్ 9(1) క్రింద దీనిని నోటీసు కూడా పరిగణించబడుతుంది. పైన తెలిపిన రుణముకు సంబంధించి పైన పేర్కొన్న తేదీలో ఇ-వేలం విక్రయం నిర్వహించబడునని రుణ గ్రహీతలకు/ హామీ దారులకు తెలియజేయడమైనది.



మాట్లాడుతున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

క్రీడలకు వయస్సు అడ్డుకాదు

- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు
- రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ వెటరన్స్‌కు బహుమతుల ప్రదానం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు వయస్సు అడ్డుకాదని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలో కొనసాగుతున్న రాష్ట్రస్థాయి పదో షటిల్ బాడ్మింటన్ క్రీడల్లో రెండోరోజు వెటరన్ విభాగంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఏదైనా ఆట ఆడితే.. వ్యాయామంతో పాటు ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. అందరూ గంట ఆరోగ్యం కోసం శ్రమించాలన్నారు. గెలుపోటములకు అతీతంగా క్రీడాస్ఫూర్తితో రాణించాలని కోరారు. తెలంగాణ పోలీస్ అకాడమీ అడిషనల్ ఎస్పీ వెంకటరావు మాట్లాడారు. రెండోరోజు జరిగిన క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ సతీమణి స్వరూప పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ డాక్టర్ సావిత్రి, ట్రెజరర్ రమేష్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వెంకన్న, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యుగేంధర్‌రెడ్డి, కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సభ్యులు మహిదర్, హసన్, యాకూబ్‌పాషా, సుధాకర్ పాల్గొన్నారు.

విశ్రాంత సీఈకి
పీహెచ్‌డీ ప్రదానం



సత్తుపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ నీటి పారుదల శాఖలో చీఫ్ ఇంజనీర్, గత ప్రభుత్వ సలహాదారు హరి ఉమాకాంత రావుకు పీహెచ్‌డీ ప్రదానం చేసారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఫ్లోరిడా ఇంటర్నేషనల్ ఓపెన్ యూనివర్శిటీ, మహర్షి కాలేజి ఆఫ్ ఆస్ట్రాలజీ ఆధ్వర్యంలో జోతిష్యశాస్రంలో పీహెచ్‌డీ (డాక్టరేట్) ప్రదానం చేసి, బంగారు పతకంతో సత్కరించారు. జ్యోతిష్యం, వాస్తులో మూఢనమ్మకాలు, అపోహలు అనే అంశంపై ఆయన పరిశోధన చేసారు. ఖమ్మం జిల్లాలో జన్మించి విద్యాభ్యాసం పూర్తి చేసి వరంగల్‌రీజినల్ ఇంజనీరింగ్ కాలేజిలో ఇంజనీరింగ్ పూర్తి చేసారు. నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజనీర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి తాలిపేరు ప్రాజెక్టు సర్వే, నిర్మాణ బాధ్యతల్లో పాల్గొన్నారు. 1986లో గిరిజన సంక్షేమ శాఖ పని చేసారు. 1997 నుంచి జిల్లాలో గ్రామీణ నీటి పారుదల శాఖలో కార్యనిర్వాహక ఇంజనీర్‌గానూ పర్యవేక్షక ఇంజనీర్‌గానూ పని చేసారు. వివిధ మాధ్యమాల్లో కొందరు జ్యోతిష్యం, వాస్తు పేరుతో తప్పుదారి పట్టిస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని వాస్తవం ఏమిటనే అంశంపై పరిశోధన చేసారు. ఈ సందర్భంగా ఉమాకాంతరావు మాట్లాడుతూ సమాజంలో జ్యోతిష్యం, వాస్తు పేరుతో జరుగుతున్న మోసాలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో జ్యోతిష్యంలో ప్రాథమిక విషయాలు-దోషాలు, అపోహలు-వాస్తవాలు అనే పుస్తకాన్ని రాసినట్లు చెప్పారు. డాక్టరేట్ పొందిన హరి ఉమాకాంతరావును జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

భారతీయులకు సంకెళ్లపై
మోదీ మౌనం వీడాలి

- ఖమ్మంలో పీడీఎస్‌యూ నిరసన
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మ దహనం



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని భారతీయులకు సంకెళ్లు వేసి తిరిగి పంపుతున్నా.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మౌనం వీడటం లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ ఆరోపించారు. భారతీయ విద్యార్థుల పట్ల అమెరికా వైఖరిని నిరసిస్తూ శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ పీజీ కాలేజీ ఎదుట నిరసన తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. భారత్‌కు అమెరికా మిత్రదేశమని ఎంతో గొప్పలు చెప్పిన మోదీ.. ఇప్పుడేందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, సాధిక్, నసీర్, విగ్నేష్, రఫీ, అనూష, అఖిల, సంధ్య, స్పందన, సింధూ పాల్గొన్నారు.

ట్రంప్‌కు దురహంకారం పెరిగింది

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్‌కు దురహంకారం పెరిగిందని, అందుకే భారతీయ ప్రజల్ని, విద్యార్థులను తిరిగి పంపుతున్నారని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఖమ్మంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇంతదారుణం జరుగుతున్నా.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అనేక దేశాల వలన ప్రజల కష్టంతోనే అమెరికా అభివృద్ధి చెందిందనే విషయాన్ని ట్రంప్ మరిచిపోయారని విమర్శించారు. భారత ప్రజలు ఇంతటి అవమానకర పరిస్థితి గతంలో ఏ దేశంలో ఎదుర్కోలేదని కేంద్ర విదేశాంగ మంత్రి జయశంకర్ పార్లమెంట్‌లో అమెరికా నిర్ణయాన్ని సమర్థించటాన్ని ఖండించారు.



ఆందోళనలో పరిసర గ్రామాల ప్రజలు

పులిగుండాలలో పులి సంచారం

పెనుబల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పులిగుండాల ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో పులి సంచారాన్ని అధికారులు శుక్రవారం నిర్ధారించారు. కనకగిరి గుట్టల్లోని అటవీ ప్రాంతంలో అంతర్భాగమైన పులిగుండాల ప్రాజెక్టు పరిసరాల్లో గురువారం పులి సంచరించినట్లు గ్రామస్థులు ఆందోళన చేయడంతో శుక్రవారం తల్లాడ ఎఫ్‌ఆర్వో ఉమ, డిప్యూటీ రేంజర్ సురేష్, పెనుబల్లి మండల తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, ఎస్‌ఐ వెంకటేష్‌లు పులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించి కాలిముద్రలను గుర్తించారు. పులిగుండాల సమీపంలో కుక్కలను వేటాడుతూ గ్రామసమీపంలో ఉన్న మామిడితోట వరకు పులి సంచరించినట్లు అధికారులు ఒక నిర్ధారణకు వచ్చారు. పులి వయస్సు సుమారు మూడేళ్లు ఉంటుందని కాలిముద్రలను బట్టి అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. పులి గ్రామ సమీపంలో సంచరించడంతో అటవీ ప్రాంత గ్రామాలైన బ్రాహ్మలకుంట, బత్తులపల్లి, తాళ్లపెంట తదితర గ్రామాల్లోని ప్రజలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు గ్రామాల్లో మైకుల ద్వారా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవోలు భరత్‌కుమార్, భీమా, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో
ఇద్దరు యువకుల దుర్మరణం

పువ్వాడ ఉదయ్‌నగర్‌లో విషాదఛాయలు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి వెళ్లిన యువకులు మరి కొద్ది నిమిషాల్లో స్వగృహానికి చేరుకునే లోపుగానే మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఇద్దరు యువకులు సమీప బంధువులు కావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రఘునాథపాలెం మండలం బూడిదంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద సంఘటన స్థానికంగా విషాదఛాయలు నింపింది. సీఐ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. పువ్వాడ ఉదయ్‌నగర్‌కు చెందిన తేజావత్ విజయ్ (23), భూక్యా వినోద్ (24) అక్కా, చెల్లెళ్ల పిల్లలు. సమీప బంధువుల నివాసంలో ఓ కార్యక్రమానికి సింగరేణి మండలం పేరుపల్లికి శుక్రవారం ఉదయం వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మరో ఐదు కి.మీ. దూరంలో పువ్వాడ ఉదయ్‌నగర్‌కు చేరుకోవాల్సి ఉంది. బూడిదంపాడు వద్దకు రాగానే బైక్‌ను ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో తేజావత్ విజయ్, భూక్యా వినోద్ ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే కన్నుమూశారు. విషయం తెలుసుకున్న సీఐ షరిఫ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



ప్రమాద స్థలంలో మృతదేహం

21న హమాలీ కార్మికుల రాష్ట్ర మహాసభలు

రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఖమ్మంసంక్షేమ విభాగం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రగతిశీల హమాలీ కార్మికుల సంఘం యూనియన్ 4వ రాష్ట్ర మహాసభలు ఈనెల 21నఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ప్రకటించారు. శుక్రవారం ఖమ్మంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 5 లక్షలకు పైగా హమాలీలు ఎగుమతి, దిగుమతి రంగాల్లో పనిచేస్తున్నారన్నారు. వ్యవసాయ మార్కెట్‌లు, సివిల్ సప్లయీస్ గోదాములు, మార్చుల్స్, ఆర్టీసీ రంగాల్లో పని చేస్తున్న హమాలీలు వెట్టిచాకిరికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీల చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణకు టీయూసీఐ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఏర్పాటు చేశామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్ల య్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు కే.శ్రీనివాస్, బోమ్మకంటి రమేశ్, శోభన్, లచ్చయ్య, శ్రీను, నాగేశ్వరరావు, సత్యం, సీతయ్య పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులకు తాతా మధు పిలుపు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధు

కారేపల్లి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ క్షణంలోనైనా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, అందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని భాగ్యనగర్ తండాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతుందని, అప్పుడే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత వస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక మంత్రులు తలో ప్రకటనలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. ఎక్కడ విన్న మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని, కేసీఆరే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన అన్నారు. రైతులకు ఇవ్వాల్సిన రైతుభరోసా, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం ఇంతవరకు అందించలేదన్నారు. ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డబ్బుల మాటలు చేరవేయడంతోనే సరిపోతుందన్నారు. రైతుల వద్ద నుంచి వరిధాన్యానికి మద్దత ధర ఇస్తామన్నారు. క్వింటాకు ఐదు వందలు రూపాయలు బోనసు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పటికి సగం రైతులకు బోనస్ డబ్బులు రాలేదన్నారు. ప్రభుత్వంపై ఎవరైనా విమర్శలు చేస్తే వారిపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతున్నట్టు తాతా మధు వాపోయారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు క్వింటా మిర్చి ధర రూ.25వేలు ఉండగా, ఇప్పుడు రూ.12వేలు ధర కూడా లేదన్నారు. దీంతో రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందన్నారు.

మాజీ జడ్పీటీసీ జగన్‌ను పరామర్శించిన మధు

ఇటీవల రోడ్డు ప్రమాధంలో కాలు విరిగి భాగ్యనగర్ తండాలో ఉంటున్న మండల మాజీ జడ్పీటీసీ వాంకుడోత్ జగన్‌ను ఎమ్మెల్సీ తాతా మధు పరామర్శించారు. తాతా మధు వెంట మాజీ జడ్పీటీసీలు మూత్యాల సత్యనారాయణ, ఉన్నం వీరేందర్, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, జిల్లా యూత్ కమిటీ నాయకులు మూత్యాల వెంకట అప్పారావు, సొసైటీ వైస్ చైర్మన్ మంగీలాల్, బత్తుల శ్రీనివాసరావు, అడప పుల్లారావు, శివరాత్రి అచ్చయ్య, రాందాస్‌నాయక్, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విరాట్ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం

- భద్రాద్రిలో చిన్నజీయర్‌స్వామి పర్యవేక్షణలో నిర్వహణ
- సిద్ధమైన జూనియర్ కళాశాల క్రీడామైదానం వేదిక
- ఏర్పాట్లను పరిశీలించిన దేవనాథ జీయర్ స్వామి, నిర్వాహకులు

భద్రాచలం, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో శనివారం విరాట్ విష్ణు సహస్రనామస్తోత్ర పారాయణం నిర్వహించనున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని వికాస తరంగిణి, జీయర్‌మఠం ఇతర ఆధ్యాత్మిక సంస్థలు నిర్వహించనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. విరాట్ విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణంను పురస్కరించుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం వేదిక సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు, వేద పండితులు, వైదిక సిబ్బంది కోసం ప్రత్యేక గ్యాలరీలను పక్కా ప్రణాళికతో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. కాగా రామాలయం నుంచి మంగళవాయిద్యాలు, కొమ్ము నృత్యం, కోలాటం, హరిదాసులు, భజన బృందాలు, బాలల విచిత్ర వేషధారణలతో శోభాయాత్ర సాగనుంది. ఈ శోభయాత్ర అగ్రభాగాన చిన జీయర్‌స్వామి పాల్గొననున్నారు. భద్రాచలంలోని రాజవీధి, సూపర్‌బజారు సెంటరు, గోపాలకృష్ణ రోడ్డు, ఆఫీసర్స్ క్లబ్, బ్రిడ్జిసెంటర్ అంబేద్కర్ సెంటర్, కూనవరం రోడ్ల మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం శోభాయాత్ర చేరనుంది.

భక్తులతో పారాయణం చేయించనున్న చినజీయర్‌స్వామి

విష్ణుసహస్రనామ స్తోత్రపారాయణం సాయంత్రం ప్రారంభం కానుండగా చినజీయర్ స్వామి భక్తులతో ఈ పారాయణ కార్యక్రమాన్ని నిర్వహింపజేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. అలాగే ప్రభుత్వ వైద్యఆరోగ్యశాఖ రెండు చోట్ల ప్రాథమిక చికిత్స కేంద్రాలు, ఒక అగ్నిమాపక యంత్రం సిద్ధంగా ఉండనుంది. గ్రామ పంచాయతీ వారి సహకారంతో వికాస తరంగిణిశాఖ 20కేంద్రాల్లో మంచి నీటి సరఫరా ఏర్పాట్లు చేపట్టగా సత్యసాయి సేవా సంస్థలు ఆ సేవలను అందజేయనున్నారు. భక్తులకు ఉచితంగా పుస్తకాలను వికాస తరంగిణి సంస్థలు అందజేయనున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 25వేల మంది భక్తులకు వస్తారనే అంచనా ఉంది.



ఏర్పాట్లును పరిశీలిస్తున్న దృశ్యం

మందకొడిగా ఇంటి పన్నుల వసూళ్లు..

- భద్రాద్రి జిల్లాలో 44.57శాతం మాత్రమే వసూలు
- కార్యదర్శులకు అదనపు పనుల బరువు
- 481 పంచాయతీలకు,120 పంచాయతీలోనే వందశాతం

జూలూరుపాడు,ఫిబ్రవరి7(ఆంధ్ర జ్యోతి): పల్లెల అభివృద్ధికి పన్నుల ద్వారా లభించే ఆదాయమే ఆధారం.. గ్రామాల్లో మౌళిక వసతుల కల్పన.. పారిశుధ్య పనులు.. రహదారుల మరమ్మతులు.. విద్యుత్ దీపాలు.. పంచాయతీ కార్యాలయాల నిర్వహణ.. ప్రభుత్వ కార్యక్రమాల ఏర్పాటు..కార్మికుల జీతభత్యాలు.. తదితరాలను ఇంటి పన్నుల రూపంలో వసూళ్ల చేసే సొమ్ముతోనే చక్కపెట్టుకోవాలి. అలాంటి కీలకమైన ఇంటి పన్నుల వసూళ్ల కార్యక్రమం భద్రాద్రి జిల్లాలో నత్తనడకన సాగుతోంది..

నిధుల విడుదల్లో ప్రభుత్వాలు జాప్యం..

పంచాయతీలకు అందించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు సకాలంలో అందక, గ్రామాల్లో ఇంటిపన్నులు వసూళ్ల కాక పంచాయతీల్లో నిధుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో పంచాయతీ కార్యదర్శులు కార్యక్రమాలు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు కార్యదర్శులు సొంతసొమ్మును వెచ్చించి పనులను చేయించడం గమనార్హం.

మందకొడిగా పన్నుల వసూళ్లు..

భద్రాద్రి జిల్లాలో 23 మండలాల పరిధిలో 481గ్రామపంచాయతీలు ఉన్నాయి. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా రూ.14,95,35,840 ఇంటి పన్నులను వసూళ్ల చేయాల్సి ఉంది. వందశాతం లక్ష్యాన్ని మార్చి 31నాటికి పూర్తి చేయాల్సి ఉంది. కాగా ఇప్పటి వరకు రూ.6,66,53,652 మాత్రమే వసూళ్ల చేశారు. ఇంక రూ.8,28, 82,188 వసూళ్ల చేయాల్సి ఉంది. జూలూరుపాడు మండలంలో రూ. 23.34లక్షలను వసూళ్ల చేయాల్సి ఉండగ ఇప్పటివరకురూ.15.33లక్షలు జమ అయ్యాయి. ఇంకా రూ.8లక్షలు వసూళ్ల కావాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు 44.57శాతం మాత్రమే పన్నులు వసూళ్ల అయ్యాయి. అళ్లపల్లి మండలంలో అత్యధికంగా 91శాతం వసూలు కాగా భద్రాచలంలో 10.33శాతం మాత్రమే వసూళ్ల చేశారు. జిల్లాలో 481 పంచాయతీల్లో కేవలం 120 పంచాయతీలోనే వందశాతం పన్నుల వసూళ్లను పూర్తి చేశారు. ఇంకా 361 పంచాయతీల్లో పన్నులను వసూళ్ల చేయాల్సి ఉంది.

జూలూరుపాడులో

జూలూరుపాడు మండలంలో 24పంచాయతీలకు 8పంచాయతీల్లోనే వందశాతం పన్నుల వసూళ్ల పూర్తి చేశారు. భద్రాచలం, బూర్గంపాడు, చంద్రుగొండ, పినపాక మండలాల్లో ఒక్క పంచాయతీలో కూడా వంద శాతం పన్నుల వసూళ్లను పూర్తి చేయలేదు. వీటిని బట్టి చూస్తే పన్నుల వసూళ్లలో భద్రాద్రి జిల్లా వెనుకబడి ఉందని తెలుస్తోంది.




వెంగన్నపాలెంలోని పంచాయతీ కార్యాలయం

గడువు ముగిసేలోగా లక్ష్యం సాధ్యమేనా?

పన్నుల వసూళ్లకు గడువు సమీపిస్తున్న తరుణంలో కార్యక్రమం మందకోడిగా సాగుతోంది. ఇంక 52రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తోంది. ఆ సమయానికి ఇంటి పన్నుల వసూళ్ల వందశాతం పూర్తి అయ్యే అవకాశం కనిపించడం లేదు. పంచాయతీ కార్యదర్శులు వివిధ ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాల్లో నిమగ్నం కావడంతో పన్నుల వసూళ్లపై కేంద్రం దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. అదనపు పనుల భారంతో కార్యదర్శులు సతమతమవుతున్నారు. ఇంటి పన్నుల వసూళ్ల కోసం వారు పూర్తి సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. ఇదిలా ఉండగ స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి ప్రారంభం కావడంతో గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లకు ప్రతిబంధకాలు ఏర్పడే అవకాశాలు ఉంది. ఈ నేపథ్యంలో గడువు ముగిసే నాటికి నిర్ధేశించిన లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమేనని అనిపిస్తోంది.

పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించాం..

చంద్రమౌళి, డీపీవో భద్రాద్రి జిల్లా



జిల్లాలో ఇంటి పన్నుల వసూళ్ల పక్రియ ఆశించిన స్థాయిలో సాగడం లేదు.. ప్రభుత్వ కార్యక్రమాలు, స్థానిక సంస్థల ఎన్నికల కార్యక్రమాల పనుల్లో కార్యదర్శులు నిమగ్నం కావడంతో పన్నుల పక్రియ మందకోడిగా సాగుతోంది. ఇప్పటివరకు జిల్లాలో 44.57శాతం మాత్రమే వసూళ్ల అయ్యాయి. పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కార్యదర్శులను ఆదేశించామని గడువు నాటికి లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

మార్కెట్ కమిటీలకు కాసుల వర్షం

(5వ పేజీ తరువాయి)

వసూలుతోనే అత్యధిక ఆదాయం సమకూరుతుంది. అంతేకాకుండా మార్కెటింగ్ శాఖకు అనుబంధంగా ఉన్న జిన్నింగ్ మిల్లులు, రైస్ మిల్లులు, వ్యవసాయ చెక్‌పోస్టులు, శీతలగిడ్డంగులు, ధాన్యం, కూరగాయల మార్కెట్‌లతో పాటు పేపర్ మిల్లులకు వెళ్లే సుబాబుల్, జామాయిల్ రవాణాపై సైతం మార్కెట్ ఫీజు మార్కెట్ ఖజానాకు చేరుతుంది.

లక్ష్యాన్ని దాటేసిన నాలుగు కమిటీలు

జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నిర్దేశించిన ఆదాయం టార్గెట్ మేరకు సత్తుపల్లి, వైరా, కల్లూరు, మద్దులపల్లి మార్కెట్ కమిటీలు లక్ష్యాన్ని దాటి ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చుకోవడం విశేషం. సత్తుపల్లి మార్కెట్‌కుఈ ఏడాది నిర్దేశించిన రూ. 3.50 కోట్లకు గాను రూ. 3.88 కోట్లు, వైరా మార్కెట్ కమిటీకి నిర్దేశించిన రూ. 4.25 కోట్లకు గాను రూ. 5.33 కోట్లు, కల్లూరు మార్కెట్‌క నిర్దేశించిన రూ. 3.20 కోట్లకు గాను రూ. 4.91 కోట్లు, మద్దులపల్లి మార్కెట్ కమిటీకి నిర్దేశించిన రూ. 1.67 కోట్లకు గాను రూ. 1.79 కోట్లు అదనంగానే ఆదాయం సమకూర్చుకున్నాయి. కాగా ఆయా మార్కెట్ కమిటీలు మార్చి నెలాఖరు కల్లా మరి కొంత ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

టార్గెట్‌లో వెనకబడ్డ ఖమ్మం

ఆదాయ లక్ష్య ఛేదనలో ఈ ఏడాది ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కొంత మేర వెనకబడినట్లు అధికారిక అంచనాలు చెబుతున్నాయి. మార్కెట్‌కు ఈఏడాది నిర్దేశించిన టార్గెట్ ఆదాయం రూ. 30 కోట్లకు గాను ఇప్పటివరకు రూ. 19.70 కోట్లు మాత్రమే వసూలు చేసింది. మిగితా సుమారు రూ. 10.30 కోట్లను మార్చి 31 కల్లా సమకూర్చుకోగలుగుతామని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది మిర్చి ధరలు తక్కువగా ఉండటం కూడా ఆదాయం తగ్గడానికి ముఖ్య కారణమని అధికారులు పేర్కొంటున్నారు.

కష్టతరంగా ఉన్నా లక్షాన్ని చేదిస్తాం

పి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ, ఖమ్మం వ్యవసాయ మార్కెట్

ఈ ఏడాది రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీకి నిర్ధేశించిన టార్గెట్‌ను మార్చి నెలాకరు వరకు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది మిర్చి పంటకు ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో మార్కెట్ ఫీజు వసూలులో కొంత వెనకబడ్డ మాట వాస్తవం. అయినా సరే ప్రతి వ్యాపారికి చెందిన మార్కెట్ ఫీజును సకాలంలో వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకుంటాం.

కారు, బైక్ ఢీ : ఒకరి మృతి

డోర్నకల్(మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): కారు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓవ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై గడ్డం ఉమ శుక్ర వారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా రఘునాథ పాలెం మండలం పాపటపల్లికి చెందిన వడ్డె వేణు (38) డోర్నకల్ నుంచి ద్విచక్రవాహనంపై తన సొంతూరు పాపటపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో డోర్నకల్ వైష్ణవి మిల్క్‌ప్లాంట్ సమీపంలో ఖమ్మం వైపు నుంచి గార్ల వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈఘటనలో వేణు కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్సనిమిత్తం ప్రైవేట్ వాహనం ద్వారా డోర్నకల్ ప్రాథమిక, ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ్నుంచి కుటుంబసభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వేణు శుక్రవారం మృతి చెందాడు. మృతు డు వేణుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి సోదరుడు వడ్డె రామనర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తోగ్గూడెం పాఠశాలను సందర్శించిన బాలమేళా బృందం

మణుగూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యాస ప్రదర్శన సృజనాత్మకత ప్రతిభను పరిశీలన చేసేందుకు విద్యాశాఖ ఏర్పాటు చేసిన బాలమేళా కమిటీ బృందం శుక్రవారం మండలంలోని తోగ్గూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించింది. పలు అంశాలపై విద్యార్థుల ప్రతిభను పరిశీలించింది. ఈ కమిటీలో జడ్పీ హెచ్ఎస్ కో ఎడ్యూకేషన్ హెచ్‌ఎం నాగశ్రీ, సిస్టెంటెంట్ సెక్రటరీ కిషోర్, సీఆర్‌పి లక్ష్మన్ ఉండగా కార్యక్రమంలో తోగ్గూడెం హెచ్‌ఎం దబ్బారి రామారావు, ఉపాధ్యాయులు సింగ రవిబాబు, శారద పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న బృంద సభ్యులు



ఫైళ్ల మాయంపై ముగ్గురిపై పోలీసు కేసు నమోదు

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ముఖ్యమైన ఫైళ్ల మాయంపై కేఎంసీ ఇంజనీరింగ్ ఏఈ యాకూబ్‌ఆలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూటౌన్ ఎస్‌హెచ్‌వో బాలకృష్ణ తెలిపారు. ఈనెల 1న సాయంత్రం 5గంటల సమయంలో కేఎంసీలోని ఇంజనీరింగ్ విభాగంలోని డీబీ సెక్షన్‌లో పనిచేస్తున్న అటెండర్ రాజేశ్వరి సాయంత్రం 5గంటల సమయంలో కార్యాలయంలో ఉన్న ఫైళ్లను రహస్యంగా బయటకు తీసుకొచ్చి కాంట్రాక్టర్ హరిప్రసాద్ చేతికి అప్పగించింది. తర్వాత ఫైల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ వద్దకు చేరింది. దీంతో పూర్తి స్థాయిలో విచారణ జరిపి అటెండర్ రాజేశ్వరితో పాటుగా వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, కాంట్రాక్టర్ హరిప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసు అధికారులు ప్రకటించారు.

అవసరం మేరకే ఉద్యోగులు ఉండాలి

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య
- ఇన్‌వార్డు, రిసెప్షన్‌లో రికార్డుల తనిఖీ

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో పరిపాలన అవసరాల మేరకే ఉద్యోగులు ఉండాలని, ఎక్కువగా ఉన్న వారు క్షేత్రస్థాయిలో బాధ్యతలకు వెళ్లాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. శుక్రవారం కేఎంసీ కార్యాలయంలోని ఇన్‌వార్డు, రెవెన్యూ, ప్రజావాణి రిసెప్షన్‌లను తనిఖీలు చేశారు. ఈనెల 4న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'అడుగు బయట పెట్టరేం' కథనంపై కమిషనర్ స్పందించారు. ఏ విభాగంలో ఎంతమంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని పేరు పేరున ప్రశ్నించారు. ఇన్‌వార్డుకు వచ్చిన దస్త్రాలను సంబంధిత విభాగాలకు ఏలా పంపుతున్నారని రికార్డులను తనిఖీలు చేశారు. రెవెన్యూ విభాగంలో బిల్లులు చెల్లించేందుకు ఎంతమంది వస్తున్నారని ప్రశ్నించారు. ఒక్కరు కార్యాలయంలో ఉండి బిల్లులు స్వీకరిస్తే సరిపోతుందని ఆదేశించారు. ప్రజావాణిలో ఎంతమంది పనిచేస్తున్నారని ప్రశ్నించారు. ఫిర్యాదుదారుల రద్దీని అనుసరించి మాత్రమే ఉద్యోగులు ఉండాలని మిగిలిన వారిని క్షేత్రస్థాయిలో విధులకు కేటాయించాలన్నారు. ప్రతీ విభాగం వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు సరైన అవగాహన కలిగేలా విభాగాలను ఏర్పాటు చేయాలని ఆర్వో శ్రీనివాసరావును ఆదేశించారు.



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

పంచాయతీ పోలింగ్ సామగ్రి విభజన

- పరిశీలించిన డీపీవో ఆశాలత

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ సామగ్రిని జిల్లా పంచాయతీ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే డీపీఆర్సీ భవనంలో బ్యాలెట్ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని ఐదు రోజులుగా నిర్వహిస్తున్నారు. జిల్లా పరిషత్‌లో ఉంచిన పోలింగ్ సామగ్రిని శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత పరిశీలించారు. ఇక్కడ 20మంది సిబ్బందితో పోలింగ్ సామగ్రిని విభజిస్తున్నారు. పోలింగ్‌కు వినియోగించే 33 రకాల ఫారాలను విభజించి సిద్ధం చేస్తున్నారు. ఒక్కసారి ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయితే బ్యాలెట్ పత్రాలతో పాటు పోలింగ్ సామగ్రిని ఆయా మండలాలకు పంచాయతీల వారీగా పంపిణీ చేయనున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం జడ్పీలో నిర్వహిస్తున్న పోలింగ్ సామగ్రి విభజన కార్యక్రమాన్ని డీపీవో ఆశాలత, ఏవో రాజేశ్వరరావు, సిబ్బంది ఉష తదితరులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలన్నారు.



పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	34
గుత్తి వంకాయ	40
బీరకాయ	50
పచ్చిమిర్చి	28
బెండకాయ	38
బెండకాయ	44
పొట్లకాయ	38
దోసకాయ	34-48
చిక్కుడు	38
నాటుచిక్కుడు	70
గోరుచిక్కుడు	54
క్యాబేజీ	20
దొండ	30-38
సొరకాయ	18
క్యారెట్	26
క్యాప్సికం	58
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	35-40
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	150
కొత్తిమీర కట్ట	20

\- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	తండేల్
శ్రీనివాస:	డాకూ మహరాజ్
సాయిరాం:	పట్టుదల
కేపీఎస్:	ఒక పథకం ప్రకారం
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఈనెల15న సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆరోజు తెలంగాణ ప్రభుత్వం సాధారణ సెలవుదినంగా ప్రకటించాలని తెలంగాణ గోర్ బంజారా ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్రఅధ్యక్షుడుభూక్యా శోభన్‌నాయక్ పేర్కొన్నారు.శుక్రవారం ఖమ్మం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. సేవాలాల్ ఆశయాలను, బోధనలను ముందుకు తీసుకెళ్లి గోర్ బంజారపిల్లలకు తెలియచేయాలన్నారు. గోర్‌బంజారాల ఆత్మబంధువు, బంజారాలు విద్యా, వైద్య రంగంలో బంజారా జాతి ప్రజలను మేలుకోలుపుతూ భారతదేశం అంతటా పర్యటించి తన బోధనలు సేవాలాల్ మహారాజ్ బోధించారన్నారు. సేవాలాల్ ఆశయాలను ప్రతి తండాకు తీసుకెళ్లి బంజరా జాతి ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి భూక్యా మంగ్యానాయక్, కోశాధికారి దరావత్ రాములునాయక్, రాష్ట్రప్రధాన కార్యదర్శి భూక్యా లచ్చునాయక్, మూడ్ బాలసింగ్, లునావత్ కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శోభన్‌నాయక్

రేకుల దొంగలు దొరికినట్లేనా?

- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు?
- రైతుల విద్యుత్ మోటార్లు రికవరీ అవుతాయా?

ఖమ్మంరూరల్,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని పెద్ద తండా డంపింగ్‌యార్డ్‌పై ఉన్న రూ.3లక్షల విలువైన రేకులను గుర్తుతెలియని దొంగలు వారం క్రితంచోరీ చేయటం తెలిసిందే.. అయితే ఈ విషయంపై (డంపింగ్ యార్డ్ రేకులు అపహరణ) ఆంధ్రజ్యోతిలో ఈనెల3న కథనం ప్రచురించడం జరిగింది. దీంతో మున్సిపల్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కమిషనర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు.

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు?

డంపింగ్ యార్డ్‌పై రేకుల అపహరణపై మున్సిపల్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముమ్మరంగా విచారణ చేపట్టారు. డంపింగ్ యార్డ్ ప్రాంతం నుంచి సుమారు 4 కిలోమీటర్ల మేర పోలీసులు సీసీపుటేజీలు పరిశీలించినట్లు తెలుస్తోంది. కొందరు ట్రాక్టర్‌లో రేకులు, విద్యుత్ మోటార్లు అపహరించుకుపోతున్నట్లు సీసీ పుటేజీల్లో కనిపించినట్లు సమాచారం. దీంతో పోలీసులు సీసీల ద్వారా ట్రాక్టర్ ఎటు నుంచి ఎక్కడికి వెళ్లంది అనేది గమనించి ఆ ట్రాక్టర్‌ను, రేకులు, విద్యుత్ మోటార్లు అపహరించిన గుర్తించినట్లు సమాచారం. వారిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. నిందితుల నుంచి మరింత సమాచారం కోసం విచారణ జరుపుతున్నట్లు తెలుస్తుంది. గుర్రాలపాడు, తెల్దారుపల్లి, మద్దులపల్లి గ్రామాల్లోని ఇటీవల అపహరణకు గురైన వ్యవసాయ బావులవద్ద ఉన్న విద్యుత్ మోటార్లు కూడా వారే అపహరించుకుపోయారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. అయితే నిందితులనుంచి రేకులు, ట్రాక్టర్, విద్యుత్ మోటార్లను రికవరీ చేసి రిమాండ్ చేసే పనిలో పోలీసులు నిమగ్నమైనట్లు విశ్వసనీయ సమాచారం.

త్యాగమూర్తి మాతా రమాబాయి

- మహిళా ప్రాంగణం అధికారి విజేత

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మాతా రమాబాయి అంబేద్కర్ మహిళలకు ఆదర్శమూర్తి అని మహిళ ప్రాంగణం అధికారి వేల్పుల విజేత అన్నారు. శుక్రవారం వీరనారీమణుల ఆశయ సాధన సమితి కార్యాలయ ఆవరణలో మాతా రమాబాయి జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం విజేత మాట్లాడుతూ తన భర్త అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతగా మారే క్రమంలో నిరంతరం ప్రోత్సాహం అందించిన రమాబాయి ధన్యజీవురాలన్నారు. నిరంతరం పేదరికం అనుభవిస్తూ కూడా తన భర్త అంబేద్కర్ ఉన్నతికి అనుక్షణంపాటుపడి రమాబాయి జీవితం నుండి మనం ఎంతో స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రబాయి, రిటైర్డుసీఐ పుల్లారి నాగయ్య, బానోతు బద్రునాయక్, పాలకుర్తి కృష్ణ, షేక్ నజీమా, త్రివేణి, స్పందన, కృష్ణవేణి, రవీంద్ర నాయక్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని టీఎన్జీవో కాలనీలోని శ్రీ భ్రమరాంబికా సమేత అమరలింగేశ్వరస్వామి, శ్రీ సీతారామాంజనేయ స్వామి, సరస్వతిదేవి, నాభిశిల, ముత్యాలమ్మ తదితర దేవాలయాల ఐదోవార్షికోత్సవం జరగనున్నది. ఈ వేడుకకు భక్తులు తరలి రావాలని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి అభిషేకాలు, సర్వతోభద్ర మండపారాధన, హోమం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

పరామర్శలు, శుభకార్యాల్లో పాల్గొన్న రాయల

నేలకొండపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు శుక్రవారం పలు శుభకార్యాలు, పరామర్శల కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత బుద్దారంలో శుక్రవారం పర్వత కనకయ్య సోదరుడి వివాహానికి హాజరై నూతన వధూవరులు గోపి-లావణ్యలను ఆశీర్వదించారు. అనంతరం ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మండల కాంగ్రెస్ నాయకుడు గోళ్ళ శ్రీనివాసరావు సతీమణి గోళ్ళ స్వర్ణలత చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నఆచార్లగూడెం గ్రామానికి చెందిన చిట్టా సైదిరెడ్డిని పరామర్శించారు.కార్యక్రమంలో పాలేరు సేవాదళ్ నాయకుడు బచ్చలకూరి నాగరాజు, మండల యువజన కాంగ్రెస్ నాయకుడు యడవల్లి నాగరాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఆరెకట్ల గురవయ్య తదితరులు రాయల వెంట ఉన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న రాయల


ఉత్సాహంగా 'స్మార్ట్‌కిడ్స్' క్రీడోత్సవం



పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో

ఖమ్మంస్పోర్ట్స్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్మార్ట్‌కిడ్స్ పాఠశాల వార్షిక క్రీడోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమైనాయి. పోటీలను డీవైఎస్‌వో సునీల్ రెడ్డి ప్రారంభించారు. చదువుతో పాటు క్రీడలు అవసరమని అన్నారు. ఈ పోటీలలో తొలిరోజు విద్యార్థులకు రన్నింగ్, మ్యూజికల్‌ఛైర్, బాల్‌కలెక్షన్ రేస్, హర్డిల్స్, కోన్‌పిరమిడ్, ఫ్రాగ్‌జంప్, చెస్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్ ఉన్నారు.

శ్రీచైతన్య ఇంజనీరింగ్ విద్యార్థినికి బంగారు పతకం



ఖమ్మంరూరల్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోన్నేకల్లు పరిధిలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదువుతున్న షేక్. ఆయేషా బేగం ఎలక్ట్రికల్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది.హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ 13వస్నాతకోత్సవం సందర్భంగా ఈ అవార్డును ప్రకటించారు. ఆయేషాబేగంను కళాశాల ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిగీతిక, డైరెక్టర్ శ్రీవిద్య శుక్రవారం అభినందించారు.

టీడీపీ కార్యాలయంలో నిత్యాన్నదానం

ఖమ్మం మామిళ్లగూడెం, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నిత్యం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తోన్నట్లు పార్టీ జిల్లా నాయకుడు కేతినేని హరీష్ తెలిపారు. శుక్రవారం ఆయన టీడీపీ కార్యాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఖమ్మం నగరానికి వచ్చే నిరుపేదలకు వ్యయప్రయాసలకోర్చి భోజనాన్ని తినలేని వారి కోసం టీడీపీ కార్యాలయంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా పేదలకు కడుపునిండా భోజనాన్ని అందించాలన్నది తమ లక్ష్యమన్నారు. శుక్రవారం నుంచి అన్నదానం కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఎవరైనా ఆసక్తి కలిగిన వారు అన్నదానానికి వితరణ చేసి సహకరించవచ్చని ఆయన తెలిపారు.

జాతర దుకాణాలకు వేలం పాటలు రేపు

కారేపల్లి, ఫిబ్రవరి7:(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని ఈ నెల 26 నుంచి జరిగే కోటీలింగాల జాతరలో దుకాణాలు ఏ ర్పాటు చేసుకునేందుకు ఈనెల 9న వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి ఛైర్మన్ అలెం వెంకటేశ్వర్లు, తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కోటిలింగాల జాతర మహాశివరాత్రి పర్వదినసందర్భంగా మూడు రోజులపాటు ఘనంగా జరగనుంది,ఈజాతరలో కొబ్బరికాయలు,లడ్డు,కొబ్బరిచిప్పలు,ఇతర వ్యాపారాలు నిర్వహించేందకు అదివారం ఉదయం 10గంటలకు ఆలయంలో వేలం పాటలు నిర్వహిస్తామని, అసక్తి ఉన్న వ్యాపారులు ఈవేలం పాటలో పాల్గొనాలని వెంకటేశ్వర్లు కోరారు.

ఎన్నికలకు ప్రణాళికతో సన్నద్ధంగా ఉండాలి

- సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల, గ్రామపంచాయతీల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అవసరమైన ప్రణాళికతో సన్నద్ధంగా ఉండాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా పోలీసు అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. గ్రామపంచాయతీ స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ఎన్నికల బందోబస్తు పోలీసులకు సవాల్‌గా మారకుండా ముందస్తుగా పోలీసు అధికారులు బందోబస్తుకు రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పోలింగ్‌స్టేషన్లు, బూత్‌ల వద్ద పరిస్థితులు, వనరులపై వివరాలు సేకరించాలన్నారు. సాధారణ, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేటగిరిల్లో భాగంగా బందోబస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎన్నికల సంబంధిత నేరాల చరిత్ర ఉన్నవారు, రౌడీషీటర్లు, ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే వారి జాబితాను సిద్ధం చేయాలన్నారు. గతఎన్నికల సందర్భంగా ఎవరెవరిపై కేసులు ఉన్నాయనే వివరాలను సేకరించి దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీ అడ్మిన్ నరేష్‌కుమార్, ఏడీసీపీలా అండ్ ఆర్డర్ ప్రసాదరావు, ఏసీపీ వెంకటేష్, సాంబరాజు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

తిరుమలాయపాలెం,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని శుక్రవారం బచ్చోడులో అఖిలపక్షపార్టీల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేశారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకుడు తిమ్మిడి హనుమంతరావు మాట్లాడుతూ 12ఏళ్లుగా వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎంపీలకు వినతిపత్రం అందించినా పట్టించుకోలేదన్నారు. బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటుతో 25గ్రామపంచాయతీలకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు పాపానాయక్, ఎల్.రజిత, జక్కుల యాదగిరి, మల్లిఖార్జున్, అంగిరేకుల నరసయ్య, జి.రమేష్, దర్మాచారి, దయాకర్, డీకొండ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి):కారు ఢీకోని వ్యక్తిమృతి చెందాడు. ఈ సంఘటన ఖమ్మంలో చోటు చేసుకుంది. ఖమ్మం అల్లీపురంలోని కృష్ణనగర్‌కు చెందిన దొబ్బల మురళీ(70) బైపాస్‌రోడ్డులోని టేకులపల్లి వంతెన సమీపంలో తన ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈక్రమంలో వెనుక నుంచి వచ్చిన బోలెరో వాహనం ఢీ కొట్టింది. తీవ్రగాయాలైన మురళీని 108లో జిల్లా హాస్పటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల9న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్-18 యూత్ ఎంపికలతో పాటు అండర్-14 ట్రయథ్లాన్, అండర్-16, 20విభాగాలకు 400 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ ఎండీ షఫీక్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి ఈనెల 18,19 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.

గంజాయితో ఉన్న ముగ్గురి అరెస్టు

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): గంజాయితో సంచరిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఖమ్మం రెండో పట్టణ సీఐ బాలకృష్ణ తెలిపారు. రమణగుట్టకు చెందిన కొట్టే ప్రవీణ్, రాపర్తినగర్‌కు చెందిన పసుపులేటి సత్యనారాయణ, గోడుగు సాయిరామ్ శుక్రవారం ఖమ్మంలో అనుమానాస్పదంగా ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ పోలీసుల కంట పడ్డారు. వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా 760 గ్రాముల ఎండు గంజాయి, ద్విచక్రవాహనం, రూ.3వేల నగదు లభించింది. దీంతో వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

బోనకల్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలకోట గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆళ్లపాడు గ్రామానికి చెందిన తాళ్లూరి నాగేశ్వరరావు(55) టీవీఎస్ వాహనంపై మధిర వెళ్లి తిరుగు ప్రయాణంలో తన గ్రామానికి వస్తున్నా డు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న స్కూటీ ఢీ కొనడంతో నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గుబ్బగుర్తికి చెందిన గోగుల నరేంద్ర అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి తన తండ్రి మృతికి కారణమయ్యాడని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నాగేశ్వరరావు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

రైస్‌మిల్లులో ధాన్యం చోరీ

కల్లూరు, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయం వైపున గల ఓ రైస్ మిల్లులో గురువారం రాత్రి 6 బస్తాల ధాన్యం చోరీ చేశారు. స్థానికంగా గల శ్రీరామ రైస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్‌ను గురువారం రాత్రి 8 గంటలకు యజమాని శ్రీకాంత్ మిల్లును బంద్ చేసి మళ్లీ శుక్రవారం ఉదయం 8 గంటలకు మిల్లు వద్దకు వచ్చి చూడగా అ డ్డికట్టు పెట్టిన ధాన్యం బస్తాలలో కొన్ని బస్తాల ధాన్యం తగ్గినట్లుగా అ నుమానం వచ్చింది. ధాన్యం బస్తాలు లెక్కించగా ఆరు బస్తాల ధాన్యం తగ్గినట్లుగా తేడా వచ్చింది. శ్రీకాంత్ ఫిర్యాదు చేయటంతో ఎస్‌ఐ హరిత కేసు నమోదు చేశారు.

రైస్‌మిల్లు కార్మికుడి మృతి

కల్లూరు, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణానికి చెందిన గౌస్‌పాషా(49) అనేక సంవత్సరాలుగా ఓ రైస్‌మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం ఒంటి గంటకు సమయంలో మిల్లులో గౌస్‌పాషా భోజనం చేస్తుండగా గుండెపోటు రావటంతో తోటి కార్మికులు ఆసుపత్రికి తీసుకెళుతుండగా మృతిచెందాడు. మృతునికి భార్య జైనాబితో పాటుగా కుమారుడు సాజిద్, కుమార్తె కరీష్మా ఉన్నారు.

కులగణన సాహసోపేత నిర్ణయం

- యువజన కాంగ్రెస్ నాయకుడు యడవల్లి

నేలకొండపల్లి, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): కులగణన సర్వే కాంగ్రెస్ ప్రభుత్వం తన సాహసోపేత నిర్ణయాన్ని తెలియచేసిందని మండల కాంగ్రెస్ నాయకుడు యడవల్లి నాగరాజు అన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ శుక్రవారం నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల చిత్రపటాలకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తోందని యువజన కాంగ్రెస్ నాయకుడు యడవల్లి నాగరాజు అన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

నామమాత్రంగా ఈజీఎస్ సామాజిక తనిఖీ

బోనకల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐకేపీ కార్యాలయంలో శు క్రవారం నిర్వహించిన ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నామమాత్రంగా ముగిసింది. గత నెల 31వ తేది నుంచి ఈనెల 6 వరకు మండలంలోని 22 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం ఆడిట్ చేశారు. సా మాజిక తనిఖీ చేసినందుకు గానూ సిబ్బందికి భోజనం, రెమ్యూనేషన్ త దితర సామాగ్రికి మొత్తం లక్షరూపాయల వరకు ఖర్చు వచ్చింది. అవక తవకలు మాత్రం రూ.76 వేలు గుర్తించారు. కొన్ని గ్రామాల్లో మస్టర్లు అధికంగా వేసి బిల్లులు తీసుకున్నట్లు తెలిపారు. ఈజీఎస్ అధికారులు, సిబ్బంది నుంచి వీటిని రికవరీ చేయాలని, దీంతో పాటు మరో 20 వేల రూపాయల జరిమానా విధించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ పీడీ చుంచు శ్రీనివాసరావు, పలువురు అధికారులు హాజరయ్యారు.



పదోతేదీతో ధాన్యం కొనుగోళ్లు బంద్

వైరా, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల పదోతేదీతో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు నిలిపివేస్తామని డీసీఎంఎస్ జనరల్ మేనేజర్ సందీప్ స్పష్టం చేశారు. వాస్తవంగా గతనెల 31వతేదీ నాటికే ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. వైరా మండలంలోని విప్పలమడక, సిరిపురం అలాగే బోనకల్ మండలంలోని మరికొన్ని గ్రామాల్లో కొంతమంది రైతుల వద్ద ధాన్యం మిగిలిపోయిందని రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకొని ఆధాన్యాన్ని ఆరోతేదీ నుంచి కొనుగోలు చేస్తున్నామని వివరించారు. పదోతేదీ నాటికి మిగిలిన రైతులందరూ తమ ధాన్యాన్ని సకాలంలో కాంటా వేయించుకోవాలని సూచించారు. ఇక ఆతర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ఉండవని, ఈ రెండురోజులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మల్లు అనంతరాములుకు నివాళి



నివాళులు అర్పిస్తున్న మల్లు నందిని

వైరా, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం పీసీసీ దివంగత అధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు అనంతరాములు 35వ వర్ధంతిని నిర్వహించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పెద్ద సోదరుడైన అనంతరాములు వర్ధంతిని ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో జరిపారు. భట్టి విక్రమార్క సతీమణి, అమ్మఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, వైరా ఏఎంసీ మాజీ చైర్మన్ పసుపులేటి మోహన్‌రావు, నాయకులు పుచ్చకాయల వీరభద్రం, ముక్కా శేఖర్‌గౌడ్, పమ్మి అశోక్, మద్దినేని రమేష్, మేరుగు రత్నరాజు, ఏపూరి మల్లికార్జున్‌రావు తదితరులు కూడా అనంతరాములు, సాదం రామారావు, వీరయ్యలు అనంతరాములు సమాధికి నివాళులర్పించారు.

సత్తుపల్లి విద్యార్థుల విజయ భేరి



అభినవ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎంఎంఎస్ ప్రొవిజినల్ రిజల్ట్‌లో సత్తుపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విజయభేరి మ్రోగించారు. ఈ సందర్భంగా స్థానిక బాలికోన్నత పాఠశాలకు చెందిన 12మంది విద్యార్థినులు ఎంపికై జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. కె.ధనవర్ష, ఎండీ.సన, ఎస్‌డీ.మాలిహా, కె.ప్రూటీజస్విత, టీ.ఉమాశ్రీ, ఎస్‌డీ.ఖాజాఅఫ్రిన్, ఎన్.త్రిశాలిని, కే.గగనగీతిక, కె.నవ్యశ్రీలక్ష్మీ, కె.యోగితా శ్రీలక్ష్మీ, ఈ.లాస్య, పీ.తనుశ్రీలు ఎంపికైనట్లు హెచ్ఎం నీరుడు నాగేశ్వరరావు తెలిపారు. అదేవిధంగా పాతసెంటర్ యూపీఎస్ విద్యార్థి యనమాల అభినవ్ ఎంపికవ్వగా వీరికి ఏడాదికి రూ.12వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు నేషనల్ స్కాలర్‌షిప్ ఇవ్వబడుతుంది.

మల్లు అనంతరాములుకు సీఎం నివాళి



నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో భట్టి

మధిర టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మాజీ పీసీసీ అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి మల్లు అనంతరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో మంత్రి ఉత్తమ కుమార్‌రెడ్డి, తెలంగాణా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షీ, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నీటి సమస్యపై స్పెషల్ డ్రైవ్ సమీక్ష

కల్లూరు, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మంచినీటి సమస్య నివారణపై మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజవర్గంలో గల కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల పరిధిలో రాబోయే వేసవిలో మంచినీటి సమస్య లేకుండా తట్టుకునేందుకు ప్రత్యేక ప్రణాళికను చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎలాంటి మంచినీటి సమస్య ఉన్న మండల స్థాయిలో అధికారులు తమ దృష్టికి తీసుకోవస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. తల్లాడ మండలంలోని గూడూరు వాటర్ గ్రిడ్ నీటి శుద్ధి కేంద్రాన్ని చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలలో ఎస్ఈ సదాశివకుమార్, ఈఈ వాణిశ్రీ, డీఈలు, ఏఈలు ఎంపీవో సురేష్‌బాబు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ పునః ప్రతిష్ఠాపన

పూజలు నిర్వహించిన నేతలు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రూ.1.20కోట్లతో స్థానిక అయ్యగారిపేటలో నూతనంగా పునఃనిర్మించిన సీతారాముల ఆలయ పునః ప్రతిష్ఠ శుక్రవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో త్రిదండి చిన్నజీయర్ స్వామి వారి మంగళా శాసనాలతో ప్రతిష్ఠ కొనసాగగా సత్తుపల్లి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు ఆలయానికి విచ్చేసి మహోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడగా పండుగ వాతావరణం కనిపించింది. కోటప్పకొండ నుంచి రాళ్లు, మైలవరం నుంచి ధ్వజస్తంభం, కుంభకోణం నుంచి ఉత్సవవిగ్రహాలు, మహాబలిపురం నుంచి సీతారాముల విగ్రహాలతో రామాలయంలో ప్రతిష్ఠాపన కార్యక్రమం వేదమంత్రోచ్చరణల నడుమ అంగరంగ వైభవంగా సాగింది. సుప్రభాతం, సేవాకాలం, చతుఃస్థానార్చన, మూలమంత్రహోమం, ద్వారతోరణ బలి, మహాపూర్ణాహుతి, కుంభయాత్ర పలు పూజాది కార్యక్రమాలు సాగగా ప్రతిష్ఠ అనంతరం సీతారామచంద్రుల వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠకు విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాదం అందజేశారు.

మువ్వా, సండ్ర, దయానంద్ పూజలు

ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా టీజీడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ కుమార్‌లు వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు జరపగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న దయానంద్

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

పెనుబల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండాలపాడు, పెనుబల్లిలో జరిగిన గ్రామాల్లో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండాలపాడు గ్రామానికి రావిలాల పవన్‌సాయి తన చెల్లెలును కాలేజీ బస్సు ఎక్కించేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చి తిరుగు ప్రయాణంలో రోడ్డు దాటుతుండగా లారీ వచ్చి ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడికి పెనుబల్లి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. పెనుబల్లి గ్రామానికి చెందిన వేముల కృష్ణయ్య సైకిల్‌పై పొలం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో కృష్ణయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడికి పెనుబల్లి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వీఎం బంజర్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

బోనకల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలకోట గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆళ్లపాడు గ్రామానికి చెందిన తాళ్లూరి నాగేశ్వరరావు(55) టీవీఎస్ వాహనంపై మధిర వెళ్లి తిరుగు ప్రయాణంలో తన గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న స్కూటీ వాహనం ఢీ కొనడంతో నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గుబ్బగుర్తికి చెందిన గోగుల నరేంద్ర స్కూటీ వాహనాన్ని అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి తన తండ్రి మృతికి కారణమయ్యాడని మృతుని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టర్ నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. నాగేశ్వరరావు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ అందరితో స్నేహపూర్వకంగా ఉండేవాడు. ఆయన మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

గుండెపోటుతో రైస్‌మిల్లు కార్మికుడి మృతి

కల్లూరు, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఓ రైస్‌మిల్లులో (డ్రైవర్) కార్మికుడిగా పనిచేస్తున్న యస్‌కె గౌస్‌పాషా (49) గుండెపోటుతో శుక్రవారం అకస్మాత్తుగా మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. కల్లూరు పట్టణానికి చెందిన గౌస్‌పాషా గత అనేక సంత్సరాలుగా ఓ రైస్‌మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజు వారిగా అతను మిల్లులోకి విధులకు వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంటకు సమయంలో మిల్లులో గౌస్‌పాషా భోజనం చేస్తుండగా గుండెపోటు రావటంతో తోటి కార్మికులు వైద్య కోసం ఆసుపత్రికి తీసుకెళతుండగా మృతిచెందాడు. మృతునికి భార్య జైనాబీతో పాటుగా కుమారుడు సాజిద్, కుమార్తె కరీష్మాలు ఉన్నారు. పాషా మృతి పట్ల టీయూసీఐ నాయకుడు వెంకన్న, హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లారావు, నల్లగట్ల సీతారాములు తదితరులు గౌస్‌పాషా మృతదేహంపై పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి సంతాపం తెలిపారు.

రైస్‌మిల్లులో 6 బస్తాల ధాన్యం చోరీ

కల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయం వైపున గల ఓ రైస్ మిల్లులో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి 6 బస్తాల ధాన్యం చోరీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. స్థానికంగా గల శ్రీరామ రైస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్‌ను గురువారం రాత్రి 8 గంటలకు యజమాని శ్రీకాంత్ మిల్లును బంద్ చేసి మళ్లీ శుక్రవారం ఉదయం 8 గంటలకు మిల్లు వద్దకు వచ్చి చూడగా అడ్డికట్టు పెట్టిన ధాన్యం బస్తాలలో కొన్ని బస్తాల ధాన్యం తగ్గినట్లుగా అనుమానం వచ్చింది. ధాన్యం బస్తాలు లెక్కించగా ఆరు బస్తాల ధాన్యం తగ్గినట్లుగా తేడా వచ్చింది. ఆరు బస్తాల ధాన్యం ఎవరో గుర్తుతెలియని దొంగలు అపహరించారని శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఎస్ఐ హరిత కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నామమాత్రంగా ఈజీఎస్ సామాజిక తనిఖీ

బోనకల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నామమాత్రంగా ముగిసింది. గత నెల 31వ తేది నుంచి ఈ నెల 6 వరకు మండలంలోని 22 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం ఆడిట్ చేశారు. సామాజిక తనిఖీ చేసినందుకు గానూ సిబ్బందికి భోజనం, రెమ్యూనేషన్ తదితర సామాగ్రికి మొత్తం లక్ష రూపాయల వరకు ఖర్చు వచ్చింది. అవకతవకలు మాత్రం రూ.76 వేలు గుర్తించారు. కొన్ని గ్రామాల్లో మస్టర్లు అధికంగా వేసి బిల్లులు తీసుకున్నట్లు తెలిపారు. ఈజీఎస్ అధికారులు, సిబ్బంది నుంచి వీటిని రికవరీ చేయాలని, దీంతో పాటు మరో 20 వేల రూపాయల జరిమానా విధించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ పీడీ చుంచు శ్రీనివాసరావు హాజరయ్యారు.

ఎంఎస్ఎన్ డిజిటల్ ల్యాండ్ సర్వేయర్స్ ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దయానంద్

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపురిలో నూతనంగా ఏర్పాటుచేసిన ఎంఎస్ఎన్ డిజిటల్ ల్యాండ్ సర్వేయర్స్ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు బుడగబోయిన మధుసూదన్‌రావు మాట్లాడుతూ ల్యాండ్ సర్వే, ఇంటిస్థలాలు, భూములు కొలిచి రిజిస్ట్రేషన్ కోసం కంప్యూటరైజ్ మ్యాప్ తయారుచేయడం, వాస్తు ప్రకారం ఇంటి ప్లాన్‌గీసి అప్రూవల్ కొరకు బ్లూ ప్రింట్, ల్యాండ్ సర్వే, లేఔట్ డిజైన్, ప్లాటింగ్, ఈటీఎస్‌తో బిల్డింగ్ ఫుటింగ్, కాలం మార్కింగ్, ఇంటి, స్థలాల వాస్తు చూస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ నిర్మించాలని రైతుల నిరసన

చింతకాని, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బస్వాపురం గ్రామ సమీపంలో సూర్యాపేట- దేవరపల్లి జాతీయరహదారి వద్ద వ్యవసాయ భూములకు వెళ్లేందుకు వీలుగా అండర్‌పాస్ నిర్మించాలని రైతులు శుక్రవారం జాతీయరహదారి నిర్మాణ పనుల వద్ద నిరసన తెలిపారు. బస్వాపురం నుంచి ఖమ్మం నగరం అల్లీపురం వరకు రెవెన్యూ రికార్డులలో 53 అడుగుల వ్యవసాయ డొంక ఉందన్నారు. వ్యవసాయ డొంక వద్ద అండర్‌పాస్ నిర్మాణం చేపట్టకపోతే వందల ఎకరాలకు రైతులు రహదారి సౌకర్యం కోల్పోతారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు అనువుగా ఉండే విధంగా జాతీయరహదారికి అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని రైతులు కోరారు. కార్యక్రమంలో రైతులు కన్నెబోయిన గోపి, నరసింహారావు, కోటేశ్వరరావు, రవి, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ముదిగొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలంలోని కమలాపురం గ్రామంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మంజూరైన రూ.1.50లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు బాధితులకు శుక్రవారం అందజేశారు. గ్రామానికి చెందిన అరిగ విజయలక్ష్మీకి రూ.42500, ఇలవల రవణమ్మకు రూ.60వేలు, నూక వెంకటనర్సమ్మకు రూ.22500, కాసాని వరుణ్‌కుమార్‌కు రూ.25వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో మధిర నియోజకవర్గ ఆత్మకమిటీ డైరెక్టర్లు వల్లూరి భద్రారెడ్డి, పందిరి అంజయ్య, నాయకులు బాబూరామిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, అవసాని వెంకటేశ్వర్లు, వాక వెంకటేశ్వర్‌రెడ్డి, పుల్లారెడ్డి, నాగేశ్వరరావు, దేవేంద్రం పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు అర్హత

మధిర రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం 8వతరగతి విద్యార్థులకు నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో మడుపల్లి ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు అర్హత సాధించినట్లు ఆపాఠశాల హెచ్ఎం తోట నర్సింహారావు తెలిపారు. చెరుకూరి రామ్‌తేజ్, పారా కార్తీక్ అనే విద్యార్థులు అర్హత సాధించారు. ఈ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మాటూరు ప్రతిభా విద్యార్థులకు పురస్కారాలు



మధిర రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మాటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ప్రతిభా విద్యార్థులకు మధిరకు చెందిన పూర్వవిద్యార్థులైన గడ్డమణుగు హన్మంతరావు, గడ్డమణుగు సత్యనారాయణ, వెంకటరమణారావులు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నగదు పురస్కారాలను శుక్రవారం అందజేశారు. అలాగే ఉస్మానియాలో ఇంజనీరింగ్ చదివే మాటూరు గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థికి నాలుగు సంవత్సరాల ఫీజు భరిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. దాతలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరమ్మ కుటుంబానికి పొంగులేటి పరామర్శ



వరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పొంగులేటి

బోనకల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గత నెల 31న బోనకల్‌లో ట్రాక్టర్ పల్టీ కొట్టిన ఘటనలో మృతి చెందిన యార్లగడ్డ వరమ్మ ఇంటికి శుక్రవారం రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెళ్లి ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వరమ్మ కుమారుడు శ్రీనివాస్‌ను ఓదార్చారు. అన్ని విధాలుగా అండగా ఉంటానని, ధైర్యంగా ఉండాలన్నారు. మంత్రి వస్తున్న సమాచారం తెలుసుకున్న క్షతగాత్రులు మరీదు పద్మ, మోర్ల శైలజ, మరీదు శైలజ, పెదగౌండ్ల వెంకటరమణ, గద్దె పుల్లమ్మ, పసల త్రివేణి, మరీదు ధనలక్ష్మీలు అక్కడకు రావడంతో వారిని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్య సేవలు అందించే క్రమంలో తన వంతుగా సహాయ, సహకారాలు అందిస్తానని హామి ఇచ్చారు. అనంతరం మంత్రికి జర్నలిస్టులు ఇళ్ల స్థలాలు ఇప్పించేలా చూడాలని వినతిపత్రం అందజేశారు. ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారం కాగానే, కేటాయింపులు జరిపేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ నాయకులు బండి వెంకటేశ్వర్లు, ఉమ్మినేని కృష్ణ, భూక్యా సైదా నాయక్, మరీదు శ్రీనివాసరావు, అంతోటి వెంకటేశ్వర్లు, గుగులోతు రమేష్, గోపి యాదవ్ పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మంత్రి

బోనకల్‌లో గుద్దూరి వెంకటేశ్వర్లు, గోవిందమ్మ దంపతుల కుమార్తె శిల్ప వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పట్టు వస్త్రాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోట రాంబాబు, తోటకూర వెంకటేశ్వరరావు, పాసంగులపాటి కోటేశ్వరరావు, చిలకా వెంకటేశ్వర్లు, బాగం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

వైరా, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. మండల కాంగ్రెస్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ఎస్సీసెల్ నాయకులు పమ్మి అశోక్, తడికమళ్ల నాగేశ్వరరావు, వేల్పుల మురళి, రత్నభరత్, తేళ్లూరి వీరయ్య, పమ్మి వెంకయ్య, మేరుగు రత్నరాజు, నారపోగు రవి, తాటి పుల్లయ్య, మోదుగు వెంకటి, శ్రీహరి, ఇనపనూరి రమేష్, మీరా, విజయరాజు, గోపాలరావు, ఏసు పాల్గొన్నారు.

రేపు జాతర దుకాణాలకు వేలం పాటలు

కారేపల్లి ఫబ్రవరి7:(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి జరిగే కోటిలింగాల జాతరలో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ఈ నెల 9న వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అలెం వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కోటిలింగాల జాతర మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజుల పాటు ఘనంగా జరగనుంది. ఆదివారం ఉదయం 10 గంటలకు ఆలయంలో వేలం పాటలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అసక్తి ఉన్న వ్యాపారులు ఈ వేలం పాటలో పాల్గొనాలని వెంకటేశ్వర్లు కోరారు.

రుణమాఫీ చేయాలని రైతుల ధర్నా

తల్లాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.రెండు లక్షల రుణమాఫీ తమకు ఇప్పటివరకు రాలేదని పేర్కొంటూ రైతులు శుక్రవారం తల్లాడ మండలం కుర్నవల్లిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి రైతుసంఘం జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతులు ఆదూరి జీవరత్నం, కొమ్మినేని ఆదినారాయణ, అయిలూరి రామకృష్ణారెడ్డి, రామిరెడ్డి, కోటిరెడ్డి, శీలం కృష్ణారెడ్డి, ఎక్కిరాల పుల్లయ్య, రేణుక పాల్గొన్నారు.

డీసీసీబీ ద్వారా మెరుగైన సేవలందించాలి

తల్లాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రైతులు, ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం తల్లాడ డీసీసీబీ బ్రాంచ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మేనేజర్ రమ్యశ్రీ, మురళీమనోహర్‌రావు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

తల్లాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో ఎం.చంద్రమౌళి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం తల్లాడ మండలం రెడ్డిగూడెంలోని క్రీస్తుజ్యోతి కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటును పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాణిశ్రీ పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి సహకారం

తల్లాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ ద్వారా దేవాలయాల అభివృద్ధికి సహకరిస్తున్నట్లు బీజేపీ ఎండోమెంట్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుదర్శన్‌ప్రసాద్ తివారి అన్నారు. శుక్రవారం తల్లాడ మండలం కలకొడిమ గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనను బీజేపీ నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు చల్లా నాగులు, సంగీతం సాయిచంద్, నాయకులు రాయల రమేష్, పులి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని తాళ్లమడలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో హామీలతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు తగినట్లుగా రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జాజిరి శ్రీనివాస్, మోరంపూడి పాండురంగారావు, కొలికపోగు సర్వేశ్వరరావు, బాల బుచ్చయ్య, వేపులపాటి కుమారస్వామి, అయినంపూడి ననందన్‌రావు, ఎలగం కృష్ణ, బండి వేలాద్రి, ఓబిళ్లనేని రామారావు, చావా రమేష్, బొప్పన వెంకటేశ్వరరావు, విశ్వనాధం, రాములు, పున్నమయ్య, జగపతిరావు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మల్లు నందిని

బోనకల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో శుక్రవారం జరిగిన గుద్దూరి వెంకటేశ్వర్లు, గోవిందమ్మ దంపతుల కుమార్తె శిల్ప వివాహానికి డిప్యూటీ సీఎం సతీమణీ మల్లు నందిని హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, ఉమ్మినేని రమేష్, పాసంగులపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైరా బస్టాండ్‌లో రెండు ప్రవేశ ద్వారాల మూసివేత

వైరా, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దాదాపు నాలుగున్నర దశాబ్ధాలుగా వైరా ఆర్టీసీ బస్టాండ్‌లోని రెండు ప్రవేశ ద్వారాల మూసివేత పనులను సంబంధిత అధికారులు చేపట్టారు. రెండురోజుల నుంచి ప్రవేశ ద్వారాల మూసివేత పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇంట్లో ఎలుకలు ఉన్నాయని ఇంటికే నిప్పు పెట్టుకున్న చందంలా ఆర్టీసీ అధికారుల తీరు ఉందనే విమర్శలు విన్పిస్తున్నాయి. జాతీయ ప్రధాన రహదారి వైపు ఉన్న ఈ రెండు ప్రవేశ ద్వారాల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశముందనే సాకుతో ఈ ద్వారాల మూసివేత పనులు చేపట్టారు. రాష్ట్రంలో ఏ ఆర్టీసీ బస్టాండ్‌కైనా కేవలం రెండు ప్రవేశ ద్వారాలు మాత్రమే ఉన్నాయని అందుకు భిన్నంగా ఒక్క వైరాలోనే నాలుగు ప్రవేశ ద్వారాలు ఉన్నందున వాటిలో రెండింటిని మూసివేస్తున్నామని ఆర్టీసీ అధికారులు చెపుతున్నారు. వైరా ఆర్టీసీ బస్టాండ్‌ను 1978 డిసెంబరు ఏడోతేదీన అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ప్రారంభించారు. వైరా క్రాస్‌రోడ్డు సమీపంలో మధిర-జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు, జాతీయ ప్రధాన రహదారి అనుసంధానంగా ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. మధిర-జగ్గయ్యపేట రోడ్డు వైపు రెండు ద్వారాలు, జాతీయ ప్రధాన రహదారిలో తల్లాడ వెళ్లే రోడ్డుకు రెండు ప్రవేశ ద్వారాలు నిర్మించారు. 1978నుంచి ఈ నాలుగు ప్రవేశ ద్వారాల ద్వారా బస్సుల రాకపోకలు కొనసాగుతున్నాయి.

బస్సుల రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు

జాతీయ ప్రధాన రహదారిలో తల్లాడ రోడ్డు వైపు ఉన్న రెండు ప్రవేశ ద్వారాలను మూసివేస్తుండటంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తనున్నాయి. భద్రాచం, మణుగూర్, కొత్తగూడెం, సత్తుపల్లి, ఏపీలోని తిరువూరు ఇతర డిపోలకు చెందిన వందలాది బస్సులు నిత్యం తల్లాడ రోడ్డులోని ఒక ద్వారం బస్టాండ్‌లోకి బస్సులు వస్తుంటాయి. ఇదే రోడ్డులో ఉన్న మరో ద్వారం నుంచి ఆయా ప్రాంతాలకు ఈ బస్సులు వెళ్తుంటాయి. అయితే ఇప్పుడు రాకపోకలు కొనసాగించే ఈ రెండు ద్వారాలను మూసివేస్తున్నారు. జాతీయ ప్రధాన రహదారి నుంచి బస్టాండ్‌కు వచ్చి వెళ్లే సమయంలో తృటిపాట్లో ప్రమాదాలు తప్పిపోతున్నందున అన్ని డిపోల మాదిరిగానే ద్వారాలను మూసివేస్తున్నామని అధికారులు చెపుతున్నారు.

మిగిలింది రెండు ద్వారాలే...

జాతీయ ప్రధాన రహదారి వైపు ఉన్న రెండు ద్వారాలు మూసివేస్తుండటంతో మధిర-జగ్గయ్యపేట వైపు ఉన్న రెండు ద్వారాలు మాత్రమే బస్సుల రాకపోకలకు అందుబాటులో ఉంటాయి. మధిర-జగ్గయ్యపేట డిపోలకు చెందిన బస్సుల రాకపోకలకు గతంలో మాదిరిగానే ఈ రెండు ద్వారాలు ఎంతో సౌకర్యంగా ఉంటాయి. ఎటుతిరిగి పైన పేర్కొన్న డిపోల బస్సుల రాకపోకలకే తీవ్ర ఇబ్బందికరంగా మారనుంది. ఆ డిపోల బస్సులు క్రాస్‌రోడ్డు నుంచి బస్టాండ్‌లోకి వచ్చి తిరిగి రెండో ద్వారం గుండా ఖమ్మం అలాగే తమ డిపోల ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. మధిర-జగ్గయ్యపేట రోడ్డు అత్యంత రద్దీగా ఉంటుంది. బస్సులు ఒకవైపు నుంచే రాకపోకలు కొనసాగిస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశముంది. బస్టాండ్ ఆవరణంలో ఇప్పటికే అనేక దుకాణాలు నిర్మించినందుకు స్థలం కూడా తగ్గిపోయింది.

చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకేనా..?

ఈ ప్రవేశ ద్వారాల మూసివేతకు ప్రమాదాలు కారణమని ఆర్టీసీ అధికారులు చెపుతున్నప్పటికీ ఆర్టీసీ బస్టాండ్ వెనుకభాగంలో ఎలక్ట్రికల్ వాహనాల కోసం చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు సమాచారం. చార్జింగ్ స్టేషన్‌లోకి మాత్రమే ప్రైవేట్ వాహనాలు వచ్చి వెళ్లేందుకుగానూ ప్రవేశ ద్వారాలను ముందు మూసివేస్తున్నారనే చర్చ నడుస్తోంది. చార్జింగ్ స్టేషన్ నిర్మించాక జాతీయ ప్రధాన రహదారి వైపు పూర్తిగా ప్రహరీతో ఆర్టీసీ బస్టాండ్‌కు సంబంధాలు లేకుండా చేసి మూసివేస్తున్న రెండు ద్వారాలను చార్జింగ్ స్టేషన్ కోసం వినియోగించేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నాలు చేపట్టారనే ప్రచారం జరుగుతోంది. దానిలో భాగంగానే ఈ రెండు ద్వారాలను మూసివేస్తున్నారనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.